క్లుప్తంగా...

మేడ్చల్ టీచర్‌కు కవి శ్రేష్ఠ బిరుదు

మేడ్చల్: నగర శివార్లలోని పటాన్ చెరులో నిర్వహించిన సాహితీ సంబరాల్లో పాల్గొన్న మేడ్చల్ టీచర్‌కు కవి శ్రేష్ఠ బిరుదు లభించింది.పట్టణంలోని సెయింట్ క్లారెట్ పాఠశాలలో తెలుగు టీచర్ గా పని చేస్తున్న అత్వెల్లికి చెందిన గండవరం కొండల్‌రావుకు నిర్వాహకులు కవి శ్రేష్ఠ బిరుదు ప్రదానం చేశారు.

4న ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

మేడ్చల్: మండలంలోని పురాతన ఆలయాల్లో ఒకటైన అత్వెల్లి వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త సుదర్శనాచారి తెలిపారు. ఆలయాన్ని పూర్తిగా తొలగించి నూతన ఆలయాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఆయన పునర్‌నిర్మాణ పనులకు త్రిదండి దేవనాథ రామానుజస్వామి ఈ నెల 4న శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌ఎఫ్‌సీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన పథకంలో చేరేందుకు పేర్లు నమోదు చేసుకోవాలని కమిషనర్ వేమనరెడ్డి తెలిపారు. ఈ పథకంలో చేరిన వారికి రూ. 5 లక్షల వరకు ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం సేవలు పొందవచ్చునన్నారు. ఉదయం 10 గంటలకు రిజిస్ట్రేషన్ ప్రారంభం కానుందని, ఆసక్తిగల వారు ఆధార్, రేషన్ కార్డు, కుటుంబ సభ్యుల ఫొటోతో పాటు రూ. 80 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

రోడ్డు కబ్జాపై హెచ్‌ఎండీఏ కమిషనర్‌కు ఫిర్యాదు

ఘట్‌కేసర్: చౌదరిగూడ మక్తలో (కల్వర్టు) రోడ్డును ఆక్రమించి వెంచర్ చేసిన నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని చౌదరిగూడకు చెందిన పులకంటి రాజశేఖర్‌రెడ్డి హెచ్‌ఎండీఏ కమిషనర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశాడు. నాలా పక్కనున్న రోడ్డును కబ్జా చేయడంతో పంట పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గతంలో పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని లేఖలో పేర్కొన్నారు. నాలా కబ్జాపై శాఖపరమైన విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

ద్వారకానగర్ బ్రిడ్జి పనుల పరిశీలన

బోడుప్పల్: బోడుప్పల్ ద్వారకానగర్ కొనసాగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులను మంగళవారం డీఈ, కాంగ్రెస్ పార్టీ నేతలు పరిశీలించారు. గతంలో 33 అడుగుల రోడ్డు మధ్యలో పెద్దగా ఉన్న బ్రిడ్జిని స్థానిక ప్రజాప్రతినిధుల ప్లాట్‌ల కోసం కుదించి, ఎత్తు తగ్గించారని డీఈ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పొన్నం తరుణ్ గౌడ్, మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని విస్తీర్ణం పెంచాల్సిన అధికారులు ఎందుకు కుదిస్తున్నారని ప్రశ్నించారు. ఎగువ ప్రాంతంలో ఎత్తుగా నాలాను నిర్మించి బ్రిడ్జి ఎత్తు తగ్గించారన్నారు. దీంతో వర్షా కాలంలో అంజయ్యనగర్, గాయత్రీనగర్, కేశవనగర్, లక్ష్మినగర్, సాయి మారుతీనగర్, బృందావన్ కాలనీల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కేవలం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఒక ప్లాట్ కోసం ఇలా చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోని పక్షంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా చేపడతామన్నారు. కార్యక్రమంలో 7డివిజన్ ఇన్‌చార్జ్ హరినాథ్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

అల్వాల్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ కార్యకర్తలకు సూచించారు. మల్కాజిగిరి నియోజకవర్గానికి చెందిన పలువురు అల్వాల్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నందికంటి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో బి.రఘురాంరెడ్డి, సి.జనార్దన్‌రెడ్డి, వి. దయాకర్‌రావు, కే.దేవేందర్, బి. సంజయ్ ఉన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్‌నగర్ కాలనీ మసీదు పరిసరాల్లో అక్రమంగా నిర్మించి మూడు పెంట్ హౌస్‌లు, సెల్లార్ నిర్మాణాన్ని కాప్రా టౌన్ ప్లానింగ్ సిబ్బంది మంగళవారం జేసీబీతో సహాయంతో కూల్చివేశారు. ఈ సందర్భంగా కాప్రా టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్ ప్రసాద్ మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా అక్రమణ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదన్నారు. అనుమతులు తీసుకుని నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. గోకుల్‌నగర్, చాణ్యుకపురికాలనీ, దత్తత్రేయనగర్ కాలనీలో అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున నిర్మాణాలను చేపడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని వారికి నోటీసులు ఇచ్చి కూల్చివేశామన్నారు.

పెద్దలూ.. పారాహుషార్



- సెలవుల్లో పిల్లలపై పర్యవేక్షణ అవసరం
- ఇండోర్ క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- గాలికి వదిలేస్తే కడుపుకోతే..

ఘట్‌కేసర్: వేసవి సెలవులు ప్రారంభమయ్యాయి. పరీక్షలు పూర్తి కావడంతో పిల్లలు ఇంటి వద్దే ఉంటున్నారు. ఇన్నాళ్లు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు సెలవులు రావడంతో ఆటలు, సరదాలతో గడపడానికి ఇష్టపడతారు. మరి కొందరు స్నేహితులు, ఫోన్లతో గడుపుతుంటారు. సరదా కోసం చేసే పనులు ఊహించని ప్రమాదాలకు దారి తీసి కన్నవారి కడుపు కోత మిగిలిస్తాయి. స్నేహితులతో ఆడుకుంటున్నారు కదా అని గాలికి వదిలేస్తే విషాదాలు వెంటాడుతాయని పెద్దలు గుర్తించాలి. మరో వైపు వేసవి తీవ్రత కారణంగా అనారోగ్యం భారిన పడే ప్రమాదం కూడా ఉంది. వారిని ఇంటిలోనే ఉంచి చిత్రలేఖనం, చేతి రాతను మెరుగు పరచుకోవడం తదితర అంశాల్లో శిక్షణ ఇప్పించాలి. ఈ నేపథ్యంలో వేసవిలో చిన్నారుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం..

ఒంటరిగా ఈతకు పంపొద్దు...

వేసవిలో చిన్నారులు ఈత కొలనులు, బావులు, చెరువుల్లో ఈత నేర్చుకునేందుకు వెళుతుంటారు. లోతు, గుంతలు తెలుసుకోకుండానే నీళ్లలోకి దిగి ప్రమాదానికి గురవుతారు. ఈత కొట్టడానికి ఒంటరిగా పంపకూడదు.

వాహనాల పట్ల జాగ్రత్తగా ఉండాలి...

చాల మంది పిల్లలు వేసవిలో సైకిల్, ద్విచక్రవాహనాలు స్వయంగా నేర్చుకోవాలని పెద్దలకు చెప్పకుండా తీసుకెళతారు. రోడ్డుపై ఎక్కితే ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉంది. వాహనాలతో పిల్లలను ఒంటరిగా వెళ్లనీయకూడదు.

వడ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

అదే పనిగా ఎండలో ఆడడంతో పిల్లలకు వడదెబ్బ తగిలే ప్రమాదముంది. అలా కాకుండా పుస్తక పఠనం అలవాటు చేయాలి. నీతి కథలు, రంగురంగుల బొమ్మలున్న పుస్తకాలు, పెయింటింగ్ వేయడం అలవాటు చేయాలి.

ఇండోర్ గేమ్స్ ఆడించాలి

పిల్లలకు ఇండోర్ గేమ్స్ అయిన చెస్, క్యారమ్స్ తదితర ఆటలు నేర్పించాలి. సాధ్యమైనంత వరకు పిల్లలను ఎండలో బయటికి పంపకుండా వారితో గడిపేందుకు పెద్దలు సమయం కేటాయించాలి. ఎల్లప్పుడు వారిని ఓ కంట కనిపెడుతూనే ఉండాలి.

యాప్స్‌తో జాగ్రత్త...

ఆన్‌లైన పాఠాల పేరుతో విద్యార్థుల చేతుల్లోకి ఫోన్లు చేరాయి. ఆన్‌లైన్ గేమ్‌ల కోసం సామాజిక మాధ్యమాల్లో ఖాతాలు తెరుస్తుంటారు. వారు నేర్చుకునే క్రమంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తల్లితండ్రులు కనిపెట్టాలి. పొరపాటున లింక్స్ ఓపెన్ చేస్తే ఖాతాలోని నగదు గల్లంతయ్యే ప్రమాదం ఉంది.

ఒంటరిగా వదలిపెట్టొద్దు..



పిల్లలు ఒకే దగ్గర పది నిమిషాలు కూడా కుదురుగా ఉండలేరు. వారిని ఇంటిలోనే ఉండేలా చూసుకోవాలి. ఇండోర్ గేమ్స్‌కు అలవాటు చేయాలి. సమయానికి ఆహారం, తగినన్ని నీరు అందించాలి.

–భాగ్య, కరస్పాండెంట్ మౌంట్ ఫోర్ట్ హైస్కూల్ అవుషాపూర్

ఎండలో వెళ్లనీయకూడదు...



వేసవిలో పిల్లలను బయటకు రానీయకూడదు. వేడికి వడదెబ్బ తగితే ప్రమాదం ఉంది. వడదెబ్బతో తలనొప్పి, విరోచనాలు, వాంతులు అవుతాయి. తరచూ నీరు తాగే విధంగా అలవాటు చేయాలి.

–వివేక్ బార్గవ, వైద్యులు ఘట్‌కేసర్

పంట నష్టం.. జేపీఎస్ సమ్మెపై చర్చ

- నేడు జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం
- హరితహారం, రోడ్లు, పేరుకుపోయిన సమస్యలు ,పెండింగ్ బిల్లుల ప్రస్తావన
- హాజరుకానున్న మంత్రి, ప్రభుత్వ విప్, కలెక్టర్ తదితరులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: అకాల వర్షాలతో దెబ్బ తిన్న పంటలకు నష్ట పరిహారం అందకపోవటం ...ధాన్యం కొనుగోళ్లు చేపట్టక పోవటంతోపాటు న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 5 రోజులుగా 30 గ్రామాల్లో విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్న జూనియర్ ,అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై జెడ్పీ సభలో చర్చించేందుకు బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు సిద్ధమవుతున్నారు. బుధవారం జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అధ్యక్షతన జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరగనుంది. జిల్లా మంత్రి సీహెచ్ మల్లారెడ్డి తోసహా ప్రభుత్వ విప్ ,ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు ,ఎంపీ రేవంత్‌రెడ్డి, కలెక్టర్ అమయ్‌కుమార్, సీఈఓ దేవసహాయం, జెడ్పీటీసీలు, ఎంపీపీలు , వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొననున్నారు.

8 గ్రామాల్లో 627 ఎకరాల్లో పంట నష్టం

జిల్లాలో ఏప్రిల్ 22 నుంచి 29 వరకు కురిసిన అకాల వర్షాలతో ఘట్కేసర్, మేడ్చల్ మండలాల పరిధిలోని 8 గ్రామాల్లో 412 మంది రైతులకు సంబంధించి 627 ఎకరాల్లోని వరి పంట దెబ్బతినటంతో భారీగా పంట నష్టం వాటిల్లింది. ఆయా గ్రామాలకు చెందిన రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేయటంతోపాటు నష్ట పరిహారం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

సెంటర్లు ప్రారంభమైనా... ముందుకు సాగని కొనుగోళ్లు

యాసంగిలో జిల్లాలో 33 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉండవచ్చునని వ్యవసాయ శాఖ అంచనా వేయగా, 11 కొనుగోలు కేంద్రాల ద్వారా 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఘట్కేసర్ మండలంలో రెండు, మేడ్చల్ మండలంలో ఒక ధాన్యం సేకరణ కేంద్రాన్ని ఐదు రోజుల క్రితమే ప్రారంభించారు. అయితే ఇప్పటి వరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదు. వర్షాలకు ధాన్యం తడిసిపోయిందన్న నెపంతో ఎదులాబాద్‌లో ధాన్యం కొనుగోలుకు అధికారులు నిరాకరించడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఐదు రోజులుగా కార్యదర్శుల సమ్మె బాట

న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 30 గ్రామాలకు చెందిన జూనియర్, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు విధులు బహిష్కరించి కలెక్టరేట్ ఎదుట ఆందోళన కొనసాగిస్తున్నారు. జిల్లాలో 61 గ్రామ పంచాయతీలు ఉండగా, 30 పంచాయతీలకు చెందిన ఉద్యోగులు సమ్మె చేస్తుండటంతో ఆయా గ్రామాల్లో పాలన పడకేసింది. ఈ విషయమై పలువురు సభ్యులు జెడ్పీలో చర్చించేందుకు సిద్ధమవుతున్నారు.

–పెండింగ్ సమస్యలపైనా ..

జిల్లాలో పేరుకుపోయిన పెండింగ్ సమస్యలతోపాటు తాగునీరు, బెల్ట్ షాపులు, గంజాయి, పంచాయతీ శాఖ బిల్లులు, అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ ,అసైన్డ్ భూముల అక్రమణలపై జెడ్పీలో చర్చకు వచ్చే అవకాశం ఉంది.

ఆర్‌ఎంసీ ప్లాంట్ అనుమతులు రద్దు చేయాలి

పోచారం: నారపల్లి, శ్రీరాంనగర్ కాలనీ సమీపంలో ప్రైమ్ ఇన్‌ఫ్రా రెడీ మిక్స్‌డ్ కాంక్రీట్ ప్లాంట్ ఏర్పాటు పనులను నిలిపివేయాలని కాలనీవాసులు కాలుష్య నియంత్రణ మండలి (ఈఈ) వెంకట్ నర్సుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. దుమ్ము, ధూళితో పాటు జల కాలుష్యానికి కారణమయ్యే ప్లాంట్‌ను నిర్మించవద్దన్నారు. దీనిపై ఈఈ స్పందిస్తూ.. ప్లాంట్ నిర్మాణం కోసం ఇచ్చిన అనుమతిని రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఈఈని కలిసిన వారిలో కాలనీ అధ్యక్షుడు సిరిగిరెడ్డి అశోక్ రెడ్డి, ప్రతినిధులు బద్రు నాయక్, మహేష్, సత్యనారాయణ, వేణు చిట్యాల, ఎ.మురళి కృష్ణ, సురేందర్ పాలెం, దిండిగల వెంకటేష్, చామల రవీందర్ రెడ్డి, డా.వేణు గోపాల్ తదితరులు ఉన్నారు.



ఆర్‌ఎంసీ ప్లాంట్‌పై ఫిర్యాదు చేస్తున్న కాలనీవాసులు

డ్రైనేజీ నిర్మాణానికి నిధులు కేటాయించండి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ నిర్మాణ పనులకు నిధులు కేటాయించాలని చైర్ పర్సన్ పావనీజంగయ్య, పదో వార్డు కౌన్సిలర్ శశికళ మంత్రి మల్లారెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం మంత్రి ని కలిసి వినతి పత్రం అందజేశారు. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి మున్సిపాలిటీలోని డ్రైనేజీలు పొంగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు, వర్షం నీరు ఇళ్లను ముంచెత్తుతోందన్నారు. డ్రైనేజీ నిర్మాణానికి అవసరమైన రూ. 5 కోట్లు మంజూరు చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు.



మంత్రి మల్లారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న చైర్ పర్సన్ పావనీ జంగయ్య, కౌన్సిలర్ శశికళ

డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలి

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో పెనుశాపంగా మారిన జవహర్‌నగర్ చెత్త డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలని దమ్మాయిగూడ మున్సిపల్ కాంగ్రెస్‌కమిటీ అధ్యక్షుడు ముప్ప రామరావు , సీనియర్ కాంగ్రెస్ నేత సామల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం వారు దమ్మాయిగూడ మున్సిపాలిటీలో డంపింగ్‌యార్డు కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఇక్కడి ప్రజలు డంపింగ్‌యార్డు దుర్వాసన భరించలేకపోతున్నారన్నారు. ఇటీవల కురిసిన వర్షాకు డంపింగ్‌యార్డు నుంచి వెలువడుతున్న వ్యర్థజలాలు దమ్మాయిగూడ చెరువులో కలుస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెరువు సమీపంలోని కాలనీవాసులు ఉదయం సాయంత్రం వేళల్లో ఇళ్ల నుంచి బయటికి రాలేని పరిస్థితి నెలకొందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో దోమలు, ఈగల బెడద తీవ్రంగా ఉందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు డంపింగ్ యార్డును తరలించేవరకు కాంగ్రెస్ పార్టీ తరపున పోరాటం కొనసాగిస్తామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు సోమేష్, ఏనుగు సంజీవరెడ్డి, ఈశ్వేత, జూపల్లి రవీందర్, కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న రమేష్‌గుప్తా తదితరులు

కీసర: కీసర గ్రామంలో నిరుపేదలకు కష్ట కాలంలో అండగా నిలిచేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని కీసర మాజీ ఎంపీటీసీ సభ్యుడు బెలిదే రమేష్‌గుప్తా అన్నారు. మంగళవారం కీసర గ్రామానికి చెందిన పగిడిపాల జంగయ్య అనారోగ్యంగా మృతి చెందారు. ఈ విషయం తెలియడంతో రమేష్‌గుప్తా మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం రూ 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కీసర గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌నేత గుర్రం శ్రీధర్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం తన వంతు సహాయంగా రూ 10 వేలు అందజేశారు. కార్యక్రమంలో ప్రభాకర్‌చారి, పగిడిపాల రవి, శ్రీకాంత్,దయానంద్‌గౌడ్, ప్రవీణ్, పుట్టశ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు నివారణకు చర్యలు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్‌లో వరద నివారణకు చర్యలు తీసుకుంటున్నామని స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని వెంకటాద్రినగర్, రాజాశ్రీనివాస్‌నగర్ పవన్ మోటార్స్ తదితర ప్రాంతాలలో ఆమె అధికారులతో కలిసి పర్యటించారు. ఇటీవల కురిసిన వర్షానికి డ్రైనేజీ పొంగి తీవ్ర ఇబ్బందులు పడ్డామని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈ. లౌక్య, ఏఈ. దివ్యజ్యోతి, నాయకులు మేకల రాముయాదవ్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో 12 రకాల సరుకులు ఇవ్వాలి



జిల్లా అదనపు కలెక్టర్‌కు జాబితా అందజేస్తున్న దృశ్యం

జవహర్‌నగర్: పేద ప్రజలకు రేషన్ షాపుల ద్వారా 12 రకాల నిత్యావసర సరుకులు అందించాలని కోరుతూ పేద ప్రజలు సంతకాలు చేసిన జాబితాను ప్రగతిశీల మహిళా సంఘం మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్యకు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీబాయి మాట్లాడుతూ జిల్లాలోని పేద ప్రజలకు రేషన్ షాపుల ద్వారా 12 రకాల వస్తువులను ఉచితంగా అందచేయాలని, గ్యాస్ సిలిండర్‌పై 50 శాతం సబ్సిడీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మహిళా నాయకులు మణెమ్మ, జయమ్మ, గంగమ్మ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.



సరిగమప ఛాంప్స్ సందడి...

సాక్షి, సిటీబ్యూరో: సంగీత శిక్షణార్థులతో కలిసి సరిగమప లిటిల్ ఛాంప్స్ సందడి చేశారు. కొంపల్లిలోని ముజిగల్ సంగీత్ అకాడమీని మంగళవారం సందర్శించిన సరిగమప లిటిల్ ఛాంప్స్ తమ సంగీత ప్రదర్శనలతో వారిని అలరించారు. ఈ సందర్భంగా ట్రినిటీ పరీక్షలు పాస్ అయిన ఔత్సాహిక సంగీత కళాకారులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సరిగమప ఛాంప్స్.. వాగ్దేవి , శశాంక్, శ్రావణితో పాటు ముజిగల్ ఫౌండర్ డాక్టర్ లక్ష్మీ నారాయణ యేలూరి తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

పేద ప్రజలకు భరోసా

మల్లాపూర్: పేద ప్రజలను తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటూ భరోసా కల్పిస్తుందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మల్లాపూర్ డివిజన్‌కు చెందిన లబ్దిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మల్లాపూర్ వార్డు కార్యాలయంలో స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. బుచ్చిరెడ్డికి రూ.44 వేలు, పుష్పలత రూ. 40 వేలు, పండిత్ రూ.60 వేలు, నర్సింహారెడ్డికి రూ.60 వేలు, మమత రూ.31 వేల చొప్పున చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాప్రా డీసీ శంకర్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు పల్లా కిరణ్ కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వాసుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా సురేష్

ఉప్పల్: జీహెచ్‌ఎంసీ ఉప్పల్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్‌గా సురేష్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న మౌనిక చందానగర్ సర్కిల్‌కు బదిలీ కావడంతో ఆమె స్థానంలో శంషాబాద్ సర్కిల్ కార్యాలయంలో పని చేస్తున్న సురేష్ నియమితులయ్యారు.

నిధులు మంజూరు చేయించండి

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూగర్భ డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మీ మంగళవారం జలమండలి జనరల్ మేనేజర్ సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందచేశారు. డివిజన్ పరిధిలోని మ్యాన్‌హోల్స్ నుంచి తీసిన వ్యర్థాలను వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలి



కలెక్టరేట్ వద్ద ఆందోళనలో కాంగ్రెస్ నేత సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి

సాక్షి,మేడ్చల్ జిల్లా: గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ పలు విభాగాల్లో రాష్ట్రానికి అవార్డులను తెచ్చిపెడుతున్న జూనియర్, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే క్రమబద్ధీకరించాలని టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న జూనియర్, అవుట్ సోర్సింగ్ జీపీ కార్యదర్శులకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మేడ్చల్ జిల్లాలో 61 గ్రామ పంచాయతీలు ఉండగా, 30 గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న జూనియర్ ,అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు 5 రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్నా జిల్లా మంత్రి మల్లారెడ్డి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా న్యాయమైన డిమాండ్ల కోసం ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్యదర్శుల సమస్యలను మల్కాజిగిరి ఎంపీ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళతానన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పర్మనెంట్ చేస్తామని హామీ ఇచ్చారు. 2018లో ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉద్యోగాలు పొందిన వీరిని అరకొర వేతనంతో ప్రొబేషనరీలోనే కొనసాగించటం దారుణమన్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా జూనియర్, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు 32 జిల్లాల్లో నిరవధిక సమ్మె చేస్తున్నారన్నారు. ప్రమాదాల్లో మరణించిన పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలను ఆదుకోవటంతోపాటు ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే పేస్కేల్ అమలు చేయాలని, జీతభత్యాలు ఇవ్వాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానం ఉండదని చెప్పిన టీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే గాలికి వదిలేసిందన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ నేతలు బాషా, సుదర్శన్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద డీఎస్‌పీ ధర్నా

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రతి పౌరునికి ఉచితంగా రాజ్యాంగాన్ని పంపిణీ చేయాలని ధర్మసమాజ్ పార్టీ(డీఎస్పీ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ వద్ద జిల్లా కన్వీనర్ రాజ్ కమల్ మహారాజ్ అధ్వర్యంలో డీఎస్‌పీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌కమల్ మాట్లాడుతూ అట్టడుగు వర్గాలైన బీసీ,ఎస్సీ, ఎస్టీ ప్రజలు భారత రాజ్యాంగం ద్వారానే లబ్ధి పొందుతున్నారన్నారు. భారత రాజ్యాంగాన్ని ప్రతి పౌరునికి ప్రభుత్వం అందజేయాలని లేని పక్షంలో జిల్లా వ్యాప్తకంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఆర్‌ఓ లింగ్యానాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సైదులు, గణేష్, శివ, హరినాథ్, పరశురాం, వివేక్ దినయ్,మహేష్, శ్రీనివాస్, మల్లేష్ ,శ్రీధర్ పాల్గొన్నారు.

